క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న జల్‌జీవన్ మిషన్ సమన్వయకర్త ఆనంద్

తగరపువలస : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని జల్‌జీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త ఆనంద్ సూచించారు. ఆనందపురం మండలం గంభీరం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన అవగాహన కల్పించారు. పాఠశాల బోరు బావి నీటిని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. చేతులు శుభ్రం చేసుకోవడం, డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యు.వి.వి.ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ అధికారి కల్పన, గంగ వరలక్ష్మి, సచివాలయ ఇంజినీర్ హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఓల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలించి సూచనలిస్తున్న ఏఈఈ రామమూర్తి

మధురవాడ : మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఓల్టేజీ సమస్యలు లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు ఏఈఈ ఎస్వీఎస్ రామమూర్తి చెప్పారు. చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద గల సిద్ధేశ్వర పీఠం షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సిబ్బందితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. 'ఓల్టేజీ హెచ్చుతగ్గులతో అవస్థలు' శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్, ప్యానల్ బోర్డులు పరిశీలించారు. అలాగే దుకాణాలకు ఎర్తింగ్, ప్యానల్ బోర్డుల నిర్వహణ, రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఏవిధమైన సమస్యలు వచ్చినా తమను నేరుగా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తాం

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కల్పించి వర్షం నీరు భూ గర్భానికి చేరేలా చర్యలు తీసుకోనున్నట్టు వాటర్ వర్క్స్ ఏఈ జి.సురేష్ తెలిపారు. గత నెల 30న 'జలం ..జటిలం' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆయన స్పందించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అందరికీ కుళాయిల ద్వారా రక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్



స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేస్తున్న యువకులు

కొమ్మాది : జీవీఎంసీ 6వ వార్డు కే 1, కే 2, కే 3 కాలనీల్లో స్పీడ్ బ్రేకర్లకు యువకులు గురువారం పెయింటింగ్ వేశారు. ఈ బ్రేకర్లకు పెయింటింగ్, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు గమనించకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో కాలనీ ప్రెసిడెంట్ అవతార్‌సింగ్ చొరవ తీసుకుని గురువారం స్థానిక యువకుల సహాయంతో 5 చోట్ల ఉన్న స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయించారు.

రూ.2.5 కోట్లతో నిర్మించి..
వదిలేశారు

- రెడ్డిపల్లిలో ప్రారంభానికి నోచుకోని బాలికల వసతిగృహ భవనం



రెడ్డిపల్లిలో నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహ భవనం

పద్మనాభం : కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వ ఆశయానికి ఆమడ దూరంలో నిలుస్తున్నాయి. ఇందుకు నిదర్శనమే పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో నిర్మించిన బాలికల వసతి గృహ భవనం. మండలంలోని రెడ్డిపల్లిలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేసేందుకు రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. రెడ్డిపల్లి నుంచి పొట్నూరు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే దీన్ని నిర్మించారు. పొట్నూరు వెళ్లేటప్పుడు పాలకులు, అధికారులు ఈ భవనం పక్కనుంచే వెళ్తుంటారు. అయినప్పటికీ రోడ్డు పక్కనే ఉన్న భవనం వైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019లో ఈ వసతి గృహం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అప్పట్లో దీనికి మంత్రి హోదాలో గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఆర్‌ఎంఎస్‌ఏ నిధులు రూ.2.5 కోట్లు వెచ్చించి... రెండు అంతస్తులతో భవన సముదాయాన్ని నిర్మించారు. సుమారు 40 గదులు నిర్మించారు. ఇంకా తాగు నీటి కోసం మోటారు ఏర్పాటు చేయలేదు. నిర్మాణ పనులు పూర్తయి మూడేళ్లు గడిచినా దీని ప్రారంభానికి అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా భవనం



రెడ్డిపల్లిలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.2.5 కోట్లతో భవనం నిర్మించారు. భవనం నిర్మించి మూడేళ్లు పూర్తవుతున్నా నేటికీ ప్రారంభించ లేదు. భవనం నిర్మించిన తర్వాత అధికారులు ఆ విషయాన్ని మరిచిపోయారు. నిరుపయోగంగా వున్న దాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– హెచ్.మహేష్, ఇసకలపాలెం

వసతి గృహానికి కేటాయించాలి



రెడ్డిపల్లిలో నిర్మించిన భవనంలో బాలికల వసృతి గృహం ఏర్పాటు చేయాలి. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి గత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలి. ప్రస్తుతం భవనం నిరుపయోగంగా మారింది. భవనంలో వసతి గృహం ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎస్.వెంకటరావు, అనంతవరం

ప్రభుత్వం మారినా అభివృద్ధి ఆగదు



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌తో జీవీఎంసీ ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక



వైఎస్ జగన్‌కు వైఎస్సార్ విగ్రహాన్ని అందిస్తున్న అక్కరమాని మంగరాజు, కార్పొరేటర్ రోహిణి



మాజీ సీఎం జగన్‌తో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, కోలా గురువులు

- జీవీఎంసీ ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆమె గురువారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మారినంత మాత్రాన వార్డు అభివృద్ధి ఆగిపోదన్నారు. వార్డులో వైఎస్సార్ సీపీ హయాంలో గణనీయమైన అభివృద్ధి చేశామన్నారు. కొమ్మాది, పీఎం పాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిరు పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వార్డును మరింతగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.



వైఎస్ జగన్‌తో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జగ్గుపల్లి నరేష్

భవిష్యత్ మనదేనని భరోసా ఇచ్చారు

తగరపువలస : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, ఆయన కుమార్తె, జీవీఎంసీ 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి గురువారం కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ భవిష్యత్ మనదేనని, పార్టీ కోసం పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారని తెలిపారు. జగన్‌కు అక్కరమాని కుటుంబ సభ్యులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బహూకరించారు. వారితోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు.

చివరిదశలో జల్‌జీవన్ మిషన్ పనులు



గొల్లల నగరపాలెంలో పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంకు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెంలో జల్‌జీవన్ మిషన్ పథకం పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా ఇప్పటికే పైపులైన్ల నిర్మాణం పూర్తికాగా గొల్లలపాలెంలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు పూర్తయింది. దీనికి రెయిలింగ్‌తోపాటు ఫినిషింగ్ పనులు మిగిలి ఉన్నాయి. ఈ ట్యాంకు నిర్మాణం పూర్తయితే పంచాయతీలో ఇంటింటికీ కుళాయిలు అందుబాటులోకి రావడంతో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా తాటితూరు బీసీ కాలనీ, అమనాం పంచాయతీ జీరుపేట, మజ్జివలస పంచాయతీ ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తికాగా అమనాం బీసీ కాలనీ, లక్ష్మిపురం, తాళ్లవలస పంచాయతీల్లో నిర్మాణ దశలో ఉన్నాయి.

శిథిల రహదారిలో ప్రయాణం నరకప్రాయం



గొల్లల తాళ్లవలసలో శిథిలమైన బీటీ రోడ్డు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలసలో జాతీయ రహదారి నుంచి దొరతోట వరకు సుమారు కిలోమీటరు పొడవున్న బీటీ రోడ్డు పూర్తిగా శిథిలమైపోయింది. 2018 ఏడాది చివర ఈ బీటీరోడ్డుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10 లక్షలతో మరమ్మతులు నిర్వహించింది. విచిత్రంగా మరమ్మతులు చేపట్టిన 20 రోజులకే కురిసిన వర్షాలకు గోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది మంది స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఈ మార్గంలో ఉన్న తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య ఆరోగ్య సిబ్బందితోపాటు భీమిలి మండలానికి చెందిన రోగులు వస్తుంటారు. రహదారి మొత్తం గోతులు, బీటలతోనే కనిపిస్తోంది. జీవీఎంసీ 4వ వార్డు, ఆనందపురం మండల ప్రజలు కూడా ఈ మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ రహదారి ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వెంటనే మరమ్మతులు లేదా పునరుద్ధరణ పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్మిక నేత రామారావుకు నివాళి



గుజ్జు రామునాయుడు భవన్‌లో వీవీ రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస : విశాఖ పోర్టు, చిట్టివలస జ్యూట్ మిల్లు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ల గౌరవ అధ్యక్షునిగా పనిచేసిన వి.వి.రామారావు అసంఘటిత రంగ కార్మికుల శ్రేయస్సు కోసం ఎనలేని కృషి చేశారని చిట్టివలస లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పడాల రమణ అన్నారు. వి.వి.రామారావు మూడో వర్ధంతి సందర్భంగా గురువారం చిట్టివలస గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్టివలస జ్యూట్ కార్మికుల హక్కుల కోసం రామారావు పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు అల్లు బాబూరావు, కాసూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు, చిల్ల అప్పలసూరి, సత్యారావు, సన్నిబాబు, ఆదినారాయణ, సత్యం గోవింద్, పాల్గొన్నారు.

ఆరిలోవలో కోడ్ వర్తించదా?



ఆరిలోవ కాలనీ ఆఖరు బస్టాప్ వద్ద టీడీపీ నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు

ఆరిలోవ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆరిలోవ ప్రాంతానికి వర్తించినట్లు లేదు. ఎక్కడికక్కడే టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు రోడ్ల పక్కన ఉన్నాయి. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, హనుమంతవాక, విజయదుర్గాకాలనీ, పదో వార్డు పాత డెయిరీ ఫారం కూడలి జాతీయ రహదారి పక్కన, రవీంద్రనగర్, 11వ వార్డు పరిధి బాలాజీనగర్, టీవీసీ పాయింట్, 12వ వార్డు తోటగరువు, పెదగదిలి, 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరు బస్టాప్ వద్ద టీడీపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీలపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రేమ చూపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ గత నెల 30 నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. కోడ్ అమల్లోకి వచ్చి మూడు రోజులు గడిచినా ఇంత వరకు ఆయా ప్రాంతాలలో స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన రాజకీయ ఫ్లెక్సీలను తొలగించలేదు. ఇది ఎన్నికల నియమ, నిబంధనలను వ్యతిరేకించడమేనని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ అధికారులు మాత్రం ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి, అధికార టీడీపీ నాయకుల ఫ్లెక్సీల జోలుకు వెళ్లకపోవడాన్ని తప్పుపడుతున్నారు. తక్షణం ఎన్నికల నిబంధనల మేరకు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గిరి ప్రదక్షిణలో సేవలకు ప్రశంసలు

ఆరిలోవ: సింహగిరి ప్రదక్షిణలో భక్తులకు 30 సంవత్సరాలుగా సేవలు అందించినందుకు దేవస్థానం అధికారులు గుర్తించి ప్రశంసించారని విశ్వాస్ సంస్థ ప్రతినిధి ఎంవీ రావు తెలిపారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరుగుతున్న గిరి ప్రదక్షిణలో భక్తులకు నిరవధికంగా సేవలందించిన పలు స్వచ్ఛంద సంస్థలను గుర్తించి గురువారం దేవస్థానం అధికారులు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఆరిలోవ కేంద్రంగా ఉన్న విశ్వాస్ సంస్థ కూడా గిరి ప్రదక్షిణ భక్తులకు ముడసర్లోవ వద్ద 30 సంవత్సరాలుగా సేవలు అందిస్తోంది. ఈ సేవలకు గుర్తింపుగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రశంసా పత్రం అందించారని రావు తెలిపారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

మధురవాడ : ఈ నెల 8న నిర్వహించే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఎస్ సోమయాజులు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఇక్కడ ప్రతీ తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారన్నారు. తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ అఫీషియో, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఉంటుందన్నారు. ఇప్పటికే ఎన్నికలు గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసులు పంపిణీ చేశామని చెప్పారు.

తగరపువలస : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించి విద్యాశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను భీమిలి మండలంలోని పాఠశాలల్లో గురువారం ప్రదర్శించారు. అనంతరం ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. ఈ విషయాలను ఫోన్లు, వాట్సాప్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. ఈ నెల 5న ఓటర్ల జాబితా ప్రదర్శన, 8న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, ప్రమాణ స్వీకారం ఉంటుందని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తెలిపారు.

పద్మనాభం : ఈ నెల 8న నిర్వహించనున్న ఎస్‌ఎంసీ ఎన్నికల్లో భాగంగా ఓటర్ల జాబితాలను పాఠశాలల్లో గురువారం ప్రదర్శించారు. 49 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని నోటీసు బోర్డుల్లో ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



రాళ్లు తేలిన యాత పేట రోడ్డు

పద్మనాభం : మండలంలోని ఐనాడ పంచాయతీ యాతపేట రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి స్థానికులు అవస్థలు పడుతున్నారు. విజయానందపురం జంక్షన్ నుంచి యాతపేట వరకు ఐదు కిలోమీటర్ల నిడివి గల మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. రెండేళ్ల క్రితం ఈ రోడ్డుపై గ్రావెల్ వేసి వదిలేశారు తప్ప బీటీగా అభివృద్ధి చేయలేదు. దీంతో రోడ్డుపై రాళ్లు తేలిపోయి గతుకులమయమైంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ గోతుల్లో నీరు చేరి బురదమయం అవుతోంది. ఈ రోడ్డు విజయానందపురం, చిన్నాపురం గ్రామస్తులు యాతపేట, సత్యనారాయణపురం, విజయనగరం జిల్లా డెంకాడ వెళ్లడానికి, యాతపేట గ్రామస్తులు మండల కేంద్రం పద్మనాభం రావడానికి ఉపయోగపడుతోంది. రోడ్డు గోతులమయం కావడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి యాతపేట రోడ్డును బీటీగా అభివృద్ధి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఔషధ మొక్కల పెంపకంతో ఆరోగ్యానికి మేలు



కృష్ణా కళాశాలలో ఔషధ మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల ప్రాంగణంలో గురువారం గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో జీవన వైవిధ్య వనం పెంచుదామని, ఇందుకు విద్యార్థుల సహాయ, సహకారాలు ఎంతో అవసరమన్నారు. భవిష్యత్ తరాల కోసం సామాజిక వనాలు పెంచాలన్నారు. ఆరోగ్యంగా ఉండడానికి ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయ విత్తనాల నిధిని ఏర్పాటు చేయడానికి గ్రీన్ క్లైమేట్, వనమాలి స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమన్నారు. మొక్కలు పెంచడం ద్వారా పక్షులు గూళ్ల పెట్టుకుని వాటి మనుగడ సాధిస్తాయన్నారు. ఆకు కూరల పెంపకాన్ని ఇంటి పెరట్లో చేపడడం ద్వారా తాజా ఆర్గానిక్ ఆకుకూరలు తినేందుకు వీలు కలుగుతుందన్నారు. వనమాలి సంస్థ ప్రతినిధులు మళ్ల సరిత, ఎ.అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

పనులు మానుకుని నిరీక్షించిన లబ్ధిదారులు

తగరపువలస : కూటమి ప్రభుత్వం ఇచ్చే పింఛను నగదు కోసం లబ్ధిదారులు పనులు మానుకుని ఎదురుచూడాల్సి వస్తోంది. భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ నమ్మివానిపాలెంలోని లబ్ధిదారుల్లో చాలా మంది పొట్ట చేతపట్టుకుని కూలి పనులు, పశువులను కొండకు తోలుకుపోవడం వంటి పనులు చేస్తుంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉదయం 6 గంటలకే వలంటీర్లు గడప వద్దకు వచ్చి పింఛన్లు అందించేవారు. అప్పట్లో ప్రతి పింఛనుదారుకు ప్రతిఫలం అందేవరకు వలంటీర్లు శ్రమించేవారు. రెండు నెలలుగా వలంటీర్లను దూరం చేసి సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. అది కూడా రెండు రోజులకే పరిమితం చేశారు. మూడో రోజు పింఛను అందించడం లేదు. సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీలో కొంత తడబాటుకు గురవుతుండడంతో ఆలస్యమవుతోంది. దీంతో పింఛనుదారులు మరో పనికి వెళ్లలేక సచివాలయ సిబ్బంది కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. గురువారం భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ నమ్మివానిపాలెంలో పింఛనుదారులు ఉపాధి పనులు మానుకుని ఉదయం 10 గంటల వరకు ఎదురు చూడాల్సి వచ్చింది.

చురుగ్గా బస్ బే నిర్మాణ పనులు



భీమిలి పాత బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న బస్ బే



బస్ బే సమీపంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

- గతంలో రూ.40 లక్షలు విడుదల చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

భీమునిపట్నం : భీమిలి పెద్దబజారు పాత బస్టాండ్ వద్ద ప్రయాణికుల సదుపాయం కోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.40 లక్షలతో బస్ బే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో బస్టాప్ ఉన్నా సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విశాఖ నగరంలో అన్ని సదుపాయాలతో విశాలమైన బస్ బేలు నిర్మించారు. అదే తరహాలో భీమిలి, తగరపువలసలో రెండు బస్ బేల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రయాణికులు ఎక్కువ మంది వేచి ఉండే విధంగా విశాలమైన బస్ బేను భీమిలిలో నిర్మిస్తున్నారు. దాని వెనుక వైపున ఉన్న చెట్టు చుట్టూ సిమెంట్ దిమ్మ ఏర్పాటు చేస్తున్నారు. ఇదే కాకుండా దాని వెనుక మెయిన్ రోడ్డును ఆనుకుని అధునాతనమైన మరుగుదొడ్లు కూడా నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న మరుగుదొడ్లు వినియోగానికి పనికిరాకుండా ఉండేవి. దీంతో ప్రయాణికుల అవసరార్థం అన్ని సదుపాయాలతో విశాలంగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. చాలా వరకు ఈ నిర్మాణాలు పూర్తి కావస్తుండగా త్వరలోనే వినియోగంలోకి రానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో భీమిలిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక అభివృద్ధి పనులు జరిగాయని... ఆ ఫలాలు నేటికీ అందుతున్నాయని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



కొండపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తగరపువలస : ప్రపంచంలో తల్లిపాలకు మించిన ఆహారం, ఔషధం లేదని... అవి అమృతంతో సమానమని ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్ట్ సీడీపీవో ఎం.శ్రీదేవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం కొండపేట, హరిజనపేట మెర్జింగ్ సెంటర్‌లో తల్లులు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. బిడ్డకు విధిగా ఆరు మాసాలపాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అందులో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు, విటమిన్లు ఉన్నాయన్నారు. లేనిపోని అపోహలతో బిడ్డలను తల్లిపాలకు దూరం చేయొద్దన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కె.ప్రమీలారాణి, అంగన్‌వాడీలు టి.ఆదిలక్ష్మి, యు.వి.రమణమ్మ, బి.వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమ్మాది : ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లి పాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని గీతం డీన్ ఎస్పీ రావు అన్నారు. తల్లి పాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. గీతం ప్రాంగణంలో తల్లి పాల వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. డాక్టర్ విజయలక్ష్మి, బి.వెంకటేశం పాల్గొన్నారు.